ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు


శంభీపూర్ రాజును కలిసిన తాజా మాజీ ప్రజాప్రతినిధులు

దుండిగల్: ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేయాలని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు సూచించారు. నిజాంపేట్ కార్పొరేషన్ కౌన్సిల్ సభ్యుల పదవీ కాలం ముగియడంతో శంభీపూర్ కార్యాలయంలో సోమవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవులు లేకపోయినా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. మనం చేసిన పనిని ప్రజలు చిరస్థాయిగా గుర్తించుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, నేతలు పాల్గొన్నారు.

బెస్ట్ అవార్డు ప్రదానం.. అభినందన


ఎస్ఐ మిరియాల శ్రీనివాస్‌ను అభినందిస్తున్న సైబరాబాద్ సీపీ

కుత్బుల్లాపూర్ : షీ టీం విభాగంలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన పేట్ బషీరాబాద్ డివిజన్ ఎస్ఐ మిరియాల శ్రీనివాస్‌ను సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి సోమవారం అభినందించారు. బెస్ట్ అవార్డును ప్రదానం చేసి.. రానున్న రోజుల్లో మరింత రాణించాలన్నారు. డివిజన్ పరిధిలోని జీనో వేల్యూ, శామీర్‌పేట్, అల్వాల్, పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ల పరిధిలో పోకిరీల ఆటకట్టించేందుకు తనిఖీలు చేస్తూ.. ఎప్పటికప్పుడు ఫిర్యాదులను పరిశీలించి చర్యలు తీసుకున్నాడు. రెండేళ్ల నుంచి వ్యక్తిగత అవార్డులను సొంతం చేసుకుంటున్నాడు.

మున్సిపల్ ప్రత్యేక అధికారిగా సాయినాథ్


సాయినాథ్‌కు పూల మొక్కను అందజేస్తున్న కమిషనర్

దుండిగల్: మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా వి.సాయినాథ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ నెల 26వ తేదీన మున్సిపాలిటీ పాలకవర్గం పదవీ కాలం ముగిసిన విషయం తెలిసిందే. సీడీఎంఏలో డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేస్తున్న ఆయనను స్పెషల్ అధికారిగా నియమిస్తు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆయనకు మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ రావు, మేనేజర్ లక్ష్మయ్య, రెవెన్యూ అధికారి ప్రభాకర్, ఏఈ సురేందర్ నాయక్, సిబ్బంది స్వాగతం పలికి సన్మానించారు.

మురుగు సమస్యను పరిష్కరించాలని నిరసన


మురుగు వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

సుభాష్‌నగర్: రాంలీల మైదానం చౌరస్తాలో డ్రైనేజీ పొంగిపొర్లుతుండటంతో ఇబ్బందులు తప్పడం లేదని, సమస్యను పరిష్కరించాలని బీజేపీ నాయకులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. పలుమార్లు కార్పొరేటర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారం కావడం లేదన్నారు. ఇప్పటికైనా తక్షణమే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అంగిడి మల్లేష్, మారి గణేష్, బైండ్ల రాము, దేవర రమేష్, బాలరాజు, సుధాకర్, గంధం కుమారస్వామి, మల్లారి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి పనులు పూర్తి చేయాలి

కుత్బుల్లాపూర్: బ్రిడ్జి పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని బీజేపీ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. సోమవారం జీడిమెట్ల డివిజన్ వెంకన్నహిల్స్‌లో నాలాపై చేపడుతున్న బ్రిడ్జి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రిడ్జి పనులు పూర్తయితే స్థానికంగా వరదనీటి సమస్యతో పాటు వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు తొలగుతాయన్నారు.

ఎట్టకేలకు పైపులైన్ మార్పు

- శిథిలావస్థకు చేరిన పైపులతో లీకేజీలు
- వృథాగా గోదావరి జలాలు
- రూ.5 కోట్లతో 1640 మీటర్ల మేర పైపులైన్


ఆదర్శనగర్ వద్ద కొనసాగుతున్న పైపులైన్ పనులు

చింతల్: శిథిలావస్థకు చేరిన పైపులైన్లతో కుత్బుల్లాపూర్‌లోని ఆయా ప్రాంతాల్లో తరచూ లీకేజీ అవుతున్నాయి. వందలాది కిలోమీటర్ల నుంచి తీసుకొచ్చిన గోదావరి జలాలు రోడ్లపై పారుతున్నాయి. దీంతో వాటి మరమ్మతులకు లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అవుతూ జలమండలికి తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. ఎట్టకేలకు ఒక పురాతన పైపులైన్‌కు మోక్షం కలిగింది. హైదరాబాద్ నగరం విస్తరించక ముందు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌ల నుంచి బాలానగర్ మీదుగా నీటిని కుత్బుల్లాపూర్ విలేజ్‌కు తరలించేందుకు 1975 –76 సంవత్సర ప్రాంతంలో ఈ పైపులైన్ వేశారు. నేడు శిథిలావస్థకు చేరి నీటి సరఫరాలో నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎట్టకేలకు జలమండలి ఉన్నతాధికారుల జోక్యంతో పైపులైన్ మార్పుకు జలమండలి అధికారులు శ్రీకారం చుట్టారు.

రూ..5 కోట్లతో పైపులైన్ పనులు

షాపూర్ నగర్, జగద్గిరిగుట్ట రిజర్వాయర్ల నుంచి ఐడీపీఎల్ మీదుగా బాలానగర్, హెచ్ఏఎల్, ఎన్ఆర్ఎస్‌సీ తదితర ప్రాంతాలకు 800 డయా ద్వారా నీటిని పంపిణీ చేసేవారు. నీటి ప్రవాహం తట్టుకోలేక శిథిలావస్థకు చేరిన పైపులైన్లతో తరచూ లీకేజీలు ఏర్పడి లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అవుతుంది. దీంతో జలమండలి అధికారులు పైపులైన్ మార్పు కోసం అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. జలమండలి ట్రాన్స్‌మిషన్ అధికారులు ఈ పైప్‌లైన్ మార్పు కోసం రూ.5 కోట్ల నిధులతో 1640 మీటర్ల మేర ఐడీపీఎల్ సిగ్నల్ నుంచి బాలానగర్ పారిశ్రామిక వాడలోని ఆర్జోనోబుల్ పెయింట్ కంపెనీ వరకు ఈ నూతన పైపులైన్ వేస్తున్నారు. అక్కడక్కడ భారీ కేబుళ్లు అడ్డుగా ఉండటంతో కొంత మేర పనులు నత్త నడకన సాగుతున్నాయి.

త్వరలోనే పనులు పూర్తి

ఐడీపీఎల్ నుంచి బాలానగర్ వరకు నిత్యం లీకేజీలు ఏర్పడి నీటి పంపిణీకి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వేసవి రాకముందే పైపులైన్ పనులు పూర్తి చేయాలని సంకల్పించాం. పనులను జీవీస్‌కే కంపెనీ దక్కించుకుంది. పనులు కూడా ప్రారంభమయ్యాయి. వారం, పది రోజుల్లో పనులు పూర్తి చేసేలా కృషి చేస్తున్నాం.

– అశోక్ కుమార్, కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జీఎం.


సిద్ధంగా ఉన్న పైపులు


లీకేజీతో వృథాగా నీరు (ఫైల్)

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. సోమవారం షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో తలారి సంపత్‌కు రూ.13,500, తాడుపర్తి శంకర్‌కు రూ.60 వేలు, వణుకూరు జ్యోతికి రూ.30 వేలు, వి.సత్యవతికి రూ.60 వేలు, సీహెచ్ నరసింహారెడ్డికి రూ.50 వేలు, రంగయ్యకు రూ.60 వేలు, నారెడ్డి నరేందర్ రెడ్డికి రూ. 27 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు కార్పొరేట్ వైద్యం అందుతుందన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, బండి శ్రీనివాస్ గౌడ్, చాంద్ భాషా, సూర రవీందర్ గౌడ్, ప్రభు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి'లో నాలుగు ఫిర్యాదులు


ఫిర్యాదు చేస్తున్న ప్రజలు

జగద్గిరిగుట్ట : జంట సర్కిళ్ల పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం నాలుగు ఫిర్యాదులు అందాయి. కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ నరసింహ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రెండు టౌన్ ప్లానింగ్, రెండు శానిటేషన్ విభాగం విషయాలపై ఫిర్యాదు రాగా టౌన్ ప్లానింగ్ అధికారి రమేష్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మీ గణేష్ ఉన్నారు. అదేవిధంగా గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రజావాణిలో ఎటువంటి ఫిర్యాదులు రాలేదు. ద్వారకా నగర్‌లో ఒక వ్యక్తి నిర్మాణం చేపట్టి అందులో ప్రతిరోజు డప్పులతో, పెద్దపెద్ద సౌండ్లతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని స్థానికులు ఉప కమిషనర్‌కు విన్నవించారు. అది తమ పరిధి కాదని బాలానగర్ ఏసీబీ ఆఫీస్‌లో ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

రోడ్డు వెడల్పు చేయాలని ఎంపీకి వినతి


ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న శేఖర్ యాదవ్

జగద్గిరిగుట్ట: సమస్యల పరిష్కారమే ధ్యేయమని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ జేకే శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో షాపూర్ నుంచి జగద్గిరిగుట్ట వరకు 4 లైన్‌గా రోడ్డును విస్తరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ..అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చంద్రశేఖర్ యాదవ్, మహిపాల్ రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓర్వలేకనే ప్రభుత్వంపై విమర్శలు

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్


జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కూన శ్రీశైలంగౌడ్, కాంగ్రెస్ నాయకులు

కుత్బుల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని సోమవారం జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ పాలనలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుల్లో అవకతవకలు జరిగాయని, అవి మరలా పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ పాలనలో నిరుపేదలు ప్రభుత్వ పథకాల లబ్ధి పొందుతున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా పథకాలను అందజేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్ రాము గౌడ్, యాదిరెడ్డి, ముత్యం రెడ్డి, దేవేందర్, మల్లేష్ యాదవ్, పరశురాములు గౌడ్, ధర్మారెడ్డి, బుచ్చిరెడ్డి, బండి శ్రీనివాస్‌గౌడ్, శ్రీను, కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పనులను త్వరగా పూర్తి చేయాలి

ఎంపీ ఈటల రాజేందర్


పనులను పరిశీలిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్: జాతీయ రహదారి 44 అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం కొంపల్లి మున్సిపాలిటీ పరిధి ఎస్ఎస్ఆర్ గార్డెన్ నుంచి బొల్లారం చౌరస్తా వరకు క్షేత్ర స్థాయిలో హైవే ప్రాజెక్ట్ ఇన్‌చార్జి రాఘవేంద్ర, ట్రాఫిక్ సీఐ నాగరాజుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ..పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఎదుట నెల రోజులుగా పనులు ఆశించిన మేర జరగడం లేదని, దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పనులను వేగవంతం చేయని పక్షంలో వచ్చే నెలలో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో ఈ సమస్యను లేవనెత్తి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి దృష్టికి తీసుకెళ్తానని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు విక్రమ్‌రెడ్డి, రాజిరెడ్డి, భరత సింహారెడ్డి, జనార్ధన్ రెడ్డి, మోహన్ రెడ్డి, సరితారావు, పట్టణ అధ్యక్షుడు సతీష్ సాగర్, అసెంబ్లీ కో కన్వీనర్ శివాజీ రాజు, మాధురి తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో ఉచిత వైద్య శిబిరం

రంగారెడ్డినగర్: కార్పొరేట్ ఆస్పత్రి యాజమాన్యాలు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం అభినందనీయమని స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనాథ్ అన్నారు. సోమవారం రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీ నగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో తులిప్స్ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన శిబిరంలో వైద్యురాలు అర్పిత ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది సంజయ్, జ్యోతి, మహేష్, స్రవంతి, ఐజ్జాక్, సభ్యులు సురేష్, ఆనంద్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో కుత్బుల్లాపూర్ ఆదర్శం


అయోధ్య నగర్‌లో సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ తారాచంద్రారెడ్డి

కుత్బుల్లాపూర్: పదేళ్ల కాలంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అభివృద్ధికి చిరునామాగా మారిందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ అయోధ్యనగర్‌లో రూ.72 లక్షలతో పూర్తి చేసిన సీసీ రోడ్డు ను సోమవారం ఆయన కార్పొరేటర్ చెరుకుపల్లి తారాచంద్రారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మౌలిక వసతులను మెరుగు పరిచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా బీఆర్ఎస్ యువజన నాయకుడు దొంతిరి కార్తీక్ రెడ్డి జ్ఞాపకార్థం రూపొందించిన కేలండర్‌ను క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో భరతసింహారెడ్డి, యేసు, రాజు, దుర్గయ్య, అంజయ్య, వీరేశం, సత్యనారాయణ, సింహాద్రి, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారిగా చంద్రమోహన్



కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపల్ పాలకవర్గం పదవీ కాలం పూర్తి కావడంతో సోమవారం ప్రత్యేక అధికారిగా చంద్రమోహన్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీహరి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఉదయం 11 గంటలకు వివిధ శాఖల అధికారులతో చంద్రమోహన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. పారిశుద్ధ్య పనుల నిర్వహణ, ట్రేడ్ లైసెన్స్‌ల జారీ, ఎల్ఆర్ఎస్ సర్వే, అడ్వర్‌టైజ్‌మెంట్లపై పన్నుల వసూలు, ప్రాపర్టీ టాక్స్ తదితర అంశాలపై చర్చించి వివరాలు తెలుసుకున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

వైద్యుల నిర్లక్ష్యం వల్లేనని బంధువుల ఆందోళన

సుభాష్‌నగర్: చికిత్స పొందుతూ మహిళా మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతి చెందిందని ఆస్పత్రి ఎదుట బంధువులు సోమవారం ఆందోళన నిర్వహించారు. స్థానికుల వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట బేకరీగడ్డకు చెందిన కరీమా (29)కు నాలుగు నెలల క్రితం సూరారంలోని మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రిలో గాల్ బ్లాడర్ సర్జరీ జరిగింది. ఆదివారం తాత్కాలిక యూరిన్ పైప్ తొలగించాలని ఆస్పత్రికి వచ్చింది. ఈ క్రమంలో యూరిన్ పైప్ తొలగించి మహిళను ఇంటికి పంపించారు. ఇంటికి వెళ్లిన మహిళ ఆరోగ్యం క్షీణించడంతో తిరిగి ఆస్పత్రిలో చేర్పించగా.. కొద్ది సేపటికే మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే చనిపోయిందని ఆరోపిస్తూ మృతురాలి బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. తమకు న్యాయం జరిగే వరకు మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లబోమని భీష్మించుకు కూర్చున్నారు. మృతురాలి కుటుంబాన్ని ఆదుకుంటామని యాజమాన్యం హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

బేకు శ్రీనివాస్‌కు డాక్టరేట్



కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ జీడిమెట్ల డివిజన్ అధ్యక్షుడు బేకు శ్రీనివాస్ డాక్టరేట్ పొందారు. ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలకు గాను ఈ నెల 25న హోసూర్‌లోని ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చరల్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్‌తో పాటు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎక్సలెన్సీ అవార్డును పొందారు.

మాజీ కార్పొరేటర్లకు సన్మానం

నిజాంపేట్: కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలను హన్మంతరెడ్డిని మాజీ కార్పొరేటర్లు సోమవారం కలిశారు. ఐదు సంవత్సరాల పదవీ కాలం ముగిసిన సందర్భంగా అభివృద్ధిపై చర్చించారు. అనంతరం వారిని ఆయన సన్మానించారు. ప్రజా సేవలో ఉండాలన్నారు.


టిప్పర్‌లో చెత్తను తరలిస్తున్న దృశ్యం

డంపింగ్ యార్డు చెత్త తరలింపు షురూ

'సాక్షి' కథనంతో స్పందించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని చెత్త డంపింగ్ యార్డు నుంచి చెత్త తరలింపును మున్సిపల్ అధికారులు సోమవారం ప్రారంభించారు. డంపింగ్ యార్డులోని చెత్తతో సమస్యలు ఎదురవుతున్న సమస్యలను 'సాక్షి' పలు మార్లు కథనాలను ప్రచురించింది. డంపింగ్ యార్డు పరిసర ప్రాంత కాలనీలు, బస్తీల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అదే విధంగా గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రారంభానికి నోచుకోవడం లేదని ప్రిన్సిపాల్ పలు మార్లు అధికారులకు విన్నవించారు. ఈ సమస్యపై ఈ నెల 24న 'కంపులో కళాశాల' అనే శీర్షికతో ప్రచురించిన కథనానికి మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ స్పందించారు. డంపింగ్ యార్డులోని చెత్తను తరలించడం ప్రారంభించారు. మూడు ఇటాచీలను ఏర్పాటు చేసి సుమారు పది టిప్పర్లతో రాత్రి, పగలు తేడా లేకుండా చెత్తను తరలిస్తున్నారు. వారం, పది రోజుల్లో మొత్తం డంపింగ్ యార్డు క్లియర్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. చెత్త డంపింగ్ యార్డును సైతం ఇక్కడి నుంచి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



సాక్షిలో ప్రచురితమైన కథనం

అనుమతిలేని పాఠశాలకు సీల్

నిజాంపేట్: బాచుపల్లిలో అనుమతి లేని పాఠశాలకు ఎంఈఓ నోటీసులు జారీ చేసి సోమవారం సీలు వేశారు. బాచుపల్లిలో ప్రగతినగర్ కమాన్ వైపు రోడ్డులో రెడ్డి ల్యాబ్స్ ఎదురుగా ఏర్పాటు చేసిన అర్‌స్టా లుమినా స్కూల్ కొద్ది రోజులుగా అడ్మిషన్లు ప్రారంభించింది. విషయం తెలుసుకున్న ఎంఈఓ రామకృష్ణ సోమవారం పాఠశాలను సందర్శించారు. పాఠశాలకు ఎటువంటి అనుమతులు లేవని గుర్తించి నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వ అనుమతులు వచ్చే వరకు ఎలాంటి అడ్మిషన్లు తీసుకోవద్దని, ప్రచారం సైతం చేయవద్దని నోటీసులు జారీ చేసి పాఠశాలకు సీలు వేశారు. ఒక వేళ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి


ఇన్‌చార్జి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సుభాష్‌నగర్: సీపీఎస్ విధానంతో ప్రభుత్వ ఉద్యోగులు నష్టపోతున్నారని, పాత పింఛన్ విధానాన్నే అమలు చేయాలని పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర బాధ్యుడు కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జి తహసీల్దార్ మంజులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తామని ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనైనా రద్దు చేసి పాత పద్ధతిని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, త్రివేణి, శ్రీనివాస్‌రెడ్డి, హరికిషన్, జగదీశ్వర్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి, జిల్లా నాయకులు రత్నం, సురేష్, మండల నాయకులు మురళీ, భాస్కర్, అశోక్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీ ఎస్పీఆర్ గ్లోబల్ స్కూల్ మొదటి వార్షికోత్సవం


పున్నారెడ్డి, చైతన్యరెడ్డిలను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ చిత్తారమ్మ దేవి నగర్‌లోని శ్రీ ఎస్పీఆర్ గ్లోబల్ పాఠశాల ప్రథమ వార్షికోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే వివేకానంద్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పాఠశాల ఫౌండర్ సొంటిరెడ్డి పున్నారెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.